క్లుప్తంగా

సుందరీకరణ పనుల పరిశీలన



మొక్కలు నాటే పనులను పరిశీలిస్తున్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో సుందరీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. డివైడర్ల మధ్య పిచ్చి మొక్కలు పీకటం, మొక్కలు నాటే పనులను మంగళవారం పరిశీలించారు. రూ.10 లక్షలతో పనులు చేపట్టినట్లు వివరించారు. రూ.30 లక్షలతో డివైడర్లకు పెయింటింగ్ వేయించి నగరాన్ని అందంగా మార్చే పనులు చేపట్టామన్నారు. డీఈఈ బీవీ రఘురాం, ఏఈ సాయిరాం పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓలు, రోటరీ క్లబ్ సభ్యులు

చీమకుర్తి: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులోని పదోతరగతి విద్యార్థులకు మంగళవారం యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంఈఓ-1, 2 వెంకటేశ్వర్లు, శివాజీ చేతుల మీదుగా యూటీఎఫ్ అధ్యక్షుడు గుండా వెంకటేశ్వర్లు, సభ్యుల ఆర్థిక సహకారంతో అందించారు. ఎంఈఓలు మాట్లాడుతు రానున్న పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. రోటరీక్లబ్ కార్యదర్శి అంబటి వీరారెడ్డి, మాజీ అధ్యక్షులు, కార్యదర్శులు గొల్లపూడి వెంకట్రావు, మన్నం నాగరాజు, హైస్కూలు హెచ్ఎం సుబ్బారావు, టీచర్‌లు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ భూమి రికార్డుల పరిశీలన



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రభాకర్ రెడ్డి

నాగులుప్పలపాడు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20 ఏళ్ళ పై బడి అసైన్‌మెంట్ చేసి ఉన్న భూములకు సంబంధించి అమ్మకాల, కొనుగోలు అంశంలో ప్రభుత్వం రైతులకు అనుకూలంగా చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉందని సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నాగులుప్పలపాడు మండలంలో ఉన్న అసైన్‌మెంట్ ల్యాండ్ రికార్డులను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. వివరాలన్నీ పరిశీలనకు అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ సుజన్ కుమార్‌ను కోరారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా బొబ్బా వెంకటరెడ్డి



బొబ్బ వెంకటరెడ్డి

వెలిగండ్ల: కనిగిరి ఏఎంసీ డైరెక్టర్‌గా మండలంలోని రామగోపాలపురం గ్రామానికి చెందిన బొబ్బ వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. కనిగిరి ఏఎంసీ కార్యాలయంలో బుధవారం డైరెక్టర్‌గా ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు షావలి, మురళి

ఒంగోలు: విజయవాడలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ తైక్వాండో పోటీలకు ఒంగోలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఒంగోలు తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో మంగళవారం ఎంపిక ప్రక్రియ జరిగింది. జూనియర్ విభాగంలో విజ్ఞాన్, నిహంత్, ద్వారకా తిరుమల రాయలు(దేవ) ఎంపికయ్యారు. సబ్ సీనియర్స్ విభాగంలో కుమారి నిఖిత్‌రెడ్డి, విష్ణేష్, దీపక్‌రెడ్డి, సీనియర్స్ విభాగంలో వంశీకృష్ణ, షేక్ షబ్బీర్, భాను, బ్లాక్ బెల్ట్ విభాగంలో షేక్ ఆరిఫ్, ఎం.ప్రశాంత్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వైఎస్సార్‌సీపీ నాయకులు షాజహాన్, బొమ్మినేని మురళి అభినందించారు. ఒంగోలు తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి, అంతర్జాతీయ తైక్వాండో కోచ్ షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు.

అయ్యప్ప స్వామికి పుష్ప యాగోత్సవం



పుష్ప యాగోత్సవం లో అయ్యప్ప స్వామి



ప్రవచకులు పొన్నూరు శ్రీనివాసులను సన్మానిస్తున్న గీతా మందిరం నిర్వాహకులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దేవస్థానం పాలకవర్గం అర్చక స్వాములు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు డొంక హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో వార్షికోత్సల్లో భాగంగా మంగళవారం ప్రాతఃకాలమున మంగళ ధ్వని, సుప్రభాత విష్వక్సేన పూజ, పుణ్యాహ హోమములు, ఉదయం తొమ్మిది గంటలకు స్వామి వారి మూలవిరాట్టుకు పంచామృత స్నపన నిర్వహించి స్వామికి బంగారు కిరీట ధారణ, విశేష ఆభరణ సేవ నిర్వహించారు. దాతలుగా ముప్పల వెంకట సుబ్రహ్మణ్యం పద్మావతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఉదయం పదకొండు గంటలకు స్వామికి పుష్పయాగోత్సవం నిర్వహించి హారతి తీర్థప్రసాద వితరణ జరిగింది. పరాంకుశం కేశవాచార్యులు, అర్చక స్వాములు రంగస్వామి, చక్రవర్తి, సమీర్ కుమార్ భక్తులు సర్వ మాలధారులు పాల్గొన్నారు.

తిరుప్పావై ప్రవచనం

ఒంగోలు మెట్రో: అనన్యశేషత్వం, అనన్య భోగత్వం, అనన్య శరణత్వం అందించే దివ్యమైన మంత్ర రాజం తిరుప్పావై పాశురాలు అని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసములు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు ధనుర్మాసం సందర్భంగా ఆనందమయి ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో గాంధీ రోడ్డు లోని గీతా మందిరంలో తిరుప్పావై ప్రవచనం నిర్వహించారు. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలతో తిరుప్పావై వ్రతం ఆచరించడం ద్వారా చతుర్విధ పురుషార్థాలు అయిన ధర్మార్థకామ్యమోక్షాలు సిద్ధిస్తాయని పొన్నూరు తెలిపారు. ముందుగా గోదాదేవి, శ్రీకృష్ణుల విగ్రహాలకు పూజా కార్యక్రమం జరిపించారు. ప్రముఖ గాయకులు ఐ.మురళీకృష్ణ, మువ్వా నాగేశ్వరరావు ప్రార్థన గీతాలను ఆలపించారు. గీతా మందిరం అధ్యక్షులు తాతా శ్రీనివాసులు, గ్రంధి పిచ్చయ్య శ్రేష్ఠి, పేర్ల వామనమూర్తి శిష్యబృందం, గీతా మందిరం భక్త బృందం, కవులు, రచయితలు కే.ఎస్.వి ప్రసాద్, జానకిరామ్, బంతికట్ల వెంకటేశ్వరరెడ్డి, విశ్వమానవ సంక్షేమ సంఘం మస్తాన్ రావు, అక్కినేని కళా పరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య, సినీ నటులు ఈదుపల్లి శివ, జి.గురవారెడ్డి సూది రమేష్, పాలూరి శివప్రసాద్ ఉపన్యాసకులు పొన్నూరు శ్రీనివాసులును సత్కరించారు.

ముక్కోటి కరపత్రాల ఆవిష్కరణ

ఒంగోలు మెట్రో: ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శనివారం ముక్కోటి ఏకాదశి పండగ పర్వదినం సందర్భంగా కరపత్రాన్ని దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి. రజనికుమారి, ధర్మకర్తలమండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, పుచ్చకాయల గోవర్ధనరెడ్డి, నెమ్మాని హరిప్రియ దేవి, సూపర్ బజారు డైరెక్టర్ వి. మురళి, అర్చక స్వాములు పి. రామానాథా చార్యులు, కేవీఎల్ శర్మ అవధాని తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముక్కోటి ఏర్పాట్లు క్యూ లైన్స్ నిర్వహణ, భక్తులకు సదుపాయాలు, ఉత్తరద్వారం ఏర్పాట్లు పరిశీలించారు. దర్శనమునకు వచ్చిన ప్రతి భక్తునికి 2024 సంవత్సర క్యాలెండర్ ను ఉచితముగా ఇస్తామని తెలిపారు

ఉత్సాహంగా వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈవో తులసీ, పద్మావతి, శ్రీదేవి

కొత్తపట్నం: స్థానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైజ్ఞానిక పదర్శన ఘనంగా నిర్వహించారు. ఎంఈవో తులసీ కుమారి, ఎంఈవో-2 పద్మావతి, హెచ్ఎం శ్రీదేవి రిబ్బన్ కట్ చేపి ప్రారంభించారు. మండల స్థాయి వ్యక్తిగత విభాగంలో 22, బృంద విభాగంలో 38, ఉపాధ్యాయ విభాగంలో 9 మంది పాల్గొన్నారు. వ్యక్తిగత విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలూరు విద్యార్థులు కె.వివేక చంద్రయాన్ ప్రదర్శన మొదటి బహుమతి, ప్రకృతి వ్యవసాయం షాపు, డి.నివాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లూరుకు రెండో బహుమతి సాధించారు. బృంద విభాగంలో ఆటోమేటిక్ ఎగ్జాస్ విత్ డస్ట్ సెన్సార్ పి.ధనలక్ష్మి, హారిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈతముక్కల మొదటి బహుమతి, సోలార్ ఎక్కక్ట్రికల్ పెన్నింగ్ జె.ఈశ్వంత్ తన్వంత్, రెండో బహుమతి పొందారు. ఉపాధ్యాయ విభాగంలో కె.రాము. జెడ్పీ హైస్కూల్ ఈతముక్కల, బి.తిరుపతయ్య జెడ్పీహెచ్ స్కూల్ ఆలూరు, సీహెచ్ వాసంతి జెడ్పీహెచ్ స్కూల్ అల్లూరు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. న్యాయ నిర్ణేతులుగా కె.వాసుదేవమూర్తి జెడ్పీహెచ్ఎస్ రుద్రవరం, ఎం.లక్ష్మీకాంతమ్మ జీజీహెచ్ఎస్ బండ్లమిట్ట ఒంగోలు వ్యవహరించారు. గెలిపొందిన వారికి బహుమతులు అందజేశారు.

డబుల్ ఓటర్లను తొలగించండి

● సబ్‌కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ నేత వినతి



సబ్‌కలెక్టర్ సేథుమాధవన్‌కు వివరాలు తెలుపుతున్న రవిచంద్ర

మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గ ఓటరు జాబితాలో డబుల్ ఓటర్లను తొలగించాలని వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి, జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర సబ్‌కలెక్టర్ సేథుమాధవన్‌ను కోరారు. మంగళవారం సాయంత్రం సబ్‌కలెక్టర్ చాంబర్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ.. కొంతమందికి తెలంగాణాలోని హైదరాబాద్‌తో పాటు ఇక్కడ కూడా ఓటు ఉందని ఎన్నికల సిబ్బంది గుర్తించి తొలగించాలని కోరారు. సంచారజాతుల వారు గత కొన్నేళ్లుగా పట్టణంలో నివాసముంటూ ఓటరు కార్డు, ఓటు హక్కు కలిగి ఉన్నారని, అయితే ఇటీవల బీఎల్‌ఓలు వారి దగ్గరికి వెళ్లి ఓటును ఆధార్ కార్డుతో అనుసంధానం చేయించుకోకుంటే తొలగిస్తామని చెప్పడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. గతంలోనే వీరికి ఓటరు కార్డు, రేషన్ కార్డు ఇచ్చారని, కొంతమందికి ఆధార్‌కార్డు లేదని దీని వల్ల ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చర్చించి సంచారజాతుల వారికి ఓటుహక్కు కల్పించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ గిరి కుమార్, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, టీడీపీ నాయకులు షేక్ మౌలాలి, టి.సత్యనారాయణ, బీజేపీ నేత చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా రవాణాపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: ప్రజా రవాణా మౌలిక సదుపాయాలు, వినియోగం పెంపుపై పార్లమెంట్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ప్రజా రవాణా వాటా తరుగుదల అంచనా, కారణాలు, తలసరి బస్సులు, సామూహిక వేగవంత రవాణా వ్యవస్థలు వినియోగం- సామర్థ్యం మరియు ప్రజా రవాణా మౌలిక సదుపాయాలు మరియు వినియోగం ప్రోత్సాహానికి ప్రభుత్వ చర్యల గురించి అడిగారు. వీటికి కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల శాఖ సహాయక మంత్రి కౌశల్ కిషోర్ సమాధానం ఇచ్చారు. దేశంలో ప్రజా రవాణా వాటాను ప్రోత్సహించి మెరుగుపరిచేందుకు రాష్ట్రాలు, పట్టణాలు, స్థానిక సంస్థలకు సులువుగా ఉండేందుకు 2006 నేషనల్ అర్బన్ ట్రాన్స్‌పోర్టు పాలసీని కేంద్రం ప్రకటించిందన్నారు. మెట్రో రైలు, పీఎంఈ బస్ సేవ, నేషనల్ ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్ పాలసీలను కేంద్రం జారీ చేసిందన్నారు. దీంతో కేంద్రం, రాష్ట్రాలు సేకరించిన వివరాల ప్రకారం దేశంలో ప్రజా రవాణా వాటా 2019-20 లో కన్నా 2021-22లో పెరిగిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 8,45,80,777 మంది జనాభాకు సేవలు అందించేవన్నారు. దేశంలో మొత్తం 20 పట్టణాలల్లో 905 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సౌకర్యం ఏర్పాటు చేశామని, కోటి మంది ఈ మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్నారని తెలిపారు.

ఉత్సాహంగా గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్పోర్ట్స్ మీట్



విజేతలతో మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: స్థానిక అన్నవరప్పాడు, అంజయ్య రోడ్డులోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూళ్ల వార్షిక స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం మంగళవారం స్థానిక డాన్‌బాస్కో స్కూలు ఆవరణలో ఉత్సాహంగా సాగింది. ముఖ్య అతిథిగా నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ చదువుకు ఇస్తున్న ప్రాధాన్యత నేడు క్రీడలకు ఇవ్వడంలేదన్నారు. చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. శారీరక దారుఢ్యంతోపాటు మానసిక సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకోవాలని సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఏపీ చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు క్రీడలు నిర్వహించేందుకు ముందుకు రావడం పట్ల అభినందనలు తెలిపారు. క్రీడలు కూడా విద్యలో భాగంగా విద్యార్థులకు అందించాలన్నారు. గుంటూరు ఆక్స్‌ఫర్డ్ రీజనల్ ఇన్‌చార్జి అమీనాబేగం మాట్లాడుతూ విద్యార్థులను రెడ్, బ్లూ, గ్రీన్, ఎల్లో హౌసులుగా విభజించి వారి మధ్య పోటీలు నిర్వహించామన్నారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు పరుగు, షాట్‌పుట్, లెమన్ అండ్ స్పూన్, స్కిప్పింగ్, గోతాలతో నడక, మొదలైన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజి మెడల్స్‌ను ముఖ్య అతిథులు చేతుల మీదుగా ఇప్పించారు. ప్రిన్సిపాళ్లు రఘురాం, మీనాకుమారి తదితరులు పర్యవేక్షించారు.

ఉపాధి పనులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేసే పనులపై మేట్‌లు అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న మేట్‌ల అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. కూలీలకు పనులు చూపించడంలో, హాజరు వేయడంలో మేట్‌లు అవగాహన కలిగి ఉండటంతో పాటు ప్రతి కూలీకి పని చూపించడానికి క్షేత్ర స్థాయిలో పనుల ఎంపిక, అంచనా లో అధికారులకు సహకారం అందించాలన్నారు. అంతే కాకుండా పని ప్రదేశంలో తమ కూలీలకు పని నిమిత్తం సౌకర్యాల కల్పనలో అధికారులను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఏపీడీ వెంకటస్వామి, ఏపీవో రవి. ఈసీ విజయలక్ష్మి ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న రెవరెండ్ జాన్ కెనడీ, రవాణ శాఖ డిప్యూటీ కమిషనర్ సుశీల

ఘనంగా సెమీ క్రిస్మస్

ఒంగోలు: స్థానిక రవాణాశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో మంగళవారం రాత్రి సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. రెవరెండ్ జాన్ కెనడీ వాక్యోపదేశం చేసి ప్రేమ సందేశాన్ని వినిపించారు. జీసస్ చెప్పిన మార్గంలో పయనిస్తూ సాటి వారి పట్ల ప్రేమను, నిరుపేదల పట్ల కరుణ చూపుతూ జీవనం సాగించాలని రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల సూచించారు. జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి రజని కుమారి, రవాణాశాఖ అధికారులు , రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు అండగా సీఎం జగన్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కొండయ్య తదితరులు

మార్కాపురం: రాష్ట్రంలో బీసీలకు అండగా నిలిచి, అభ్యున్నతికి కృషి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేపీ నాగార్జునరెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. తమ తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే కేపీ సూచించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు అచ్చయ్య, బి.కాశయ్య, మండ్లా రామాంజనేయులు, ఎం.పోలయ్య, బి.వెంకట సుబ్బయ్య, చిన్న లక్ష్మయ్య, నాద గురుబ్రహ్మం, మల్లికార్జున్, మండ్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన



హెచ్ఐవీ పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున సినార్డ్ సంస్థ ప్రతినిధులు

చీమకుర్తి: సినార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులోని విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ లక్షణాలు, వచ్చిన తర్వాత తీసుకోవాలసిన జాగ్రత్తలపై వివరించారు. హెచ్ఐవీ సోకిన వారి పట్ల వివక్షత చూపకుండా ఉండాలన్నారు. హైస్కూలు హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఎస్.సుబ్బారావు, సినార్డ్ మేనేజర్ సునీల్‌బాబు, ఆ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా నగర అధ్యక్షురాలిగా ధనిశెట్టి



నియామక పత్రం అందిస్తున్న శివా రెడ్డి

ఒంగోలు సెంట్రల్: భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా నగర అధ్యక్షురాలిగా ధనిశెట్టి పావనిని నియమిస్తూ మంగళవారం జిల్లా అధ్యక్షుడు పీవీ శివా రెడ్డి, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి తీగల సత్యవతి నియామక పత్రం అందించారు. పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని, తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షుడు, మహిళా మోర్చ జిల్లా కార్యదర్శికి, పార్టీ పెద్దలకు పావని కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షురాలు క్రిష్ణవేణి, జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుమల, మీడియా ఇన్‌చార్జి ధనిశెట్టి రామునాయుడు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి దహన సంస్కారం

దర్శి: వెంకటాచలం పల్లిలోని కాశీ నాయన ఆశ్రమంలో అనాథ వృధునికి మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు దహన సంస్కారాలు చేశారు. ఆశ్రమంలో వృద్ధుడు మరణించిన విషయం నిర్వాహకులు తెలియజేయగానే స్వచ్ఛంద సంస్థలకు చెందిన ధనిరెడ్డి వెంకటరెడ్డి, కప్పురం శ్రీనివాసరెడ్డి, కామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొని అంత్యక్రియలు నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు దారం వెంకటేశ్వరరెడ్డి, పాలం లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

బైకు నుంచి పడి వ్యక్తికి గాయాలు

కొమరోలు: ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని దద్దవాడ గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. గిద్దలూరు మండలం వెల్లుపల్లి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి పనిపై తాటిచెర్లమోటుకు వెళ్తుండగా అదుపుతప్పి ద్విచక్ర వాహనంపై నుంచి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

రేషన్ ఇవ్వాలి



సెంటర్ పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్

మద్దిపాడు: అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో ఉన్న గర్భిణులకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్‌ను వెంటనే వారిని పిలిపించుకుని పంపిణీ చేయాలని డీఆర్‌డీఏ డాక్టర్ వైఎస్సార్ క్రాంతి పథం పీడీ తేళ్ల రవికుమార్ అన్నారు. మంగళవారం దొడ్డవరం, మద్దిపాడు అంగన్‌వాడీ సెంటర్‌లను పరిశీలించారు. అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె చేస్తున్న క్రమంలో చిన్నారులకు, గర్భిణులకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం సచివాలయ సిబ్బందిని కేటాయించిందన్నారు. వీఓఏలు అంగన్‌వాడీ సెంటర్‌లలో ఉండే చిన్నారులకు భోజనం వండి పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్దార్ బాష

ఒంగోలు అర్బన్: నగరంలో నిరాశ్రయులకు సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెక్రటరీ సర్దార్‌బాష మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. నగరంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, కలెక్టరేట్, శివాలయం, సాయిబాబా మందిరం తదితర ప్రాంతాల్లో రోడ్ల వెంట నిద్రించే నిరాశ్రయులకు రూ.6వేల విలువ చేసే దుప్పట్లను అందించారు. ట్రస్టు సభ్యులు సుబ్బారెడ్డి, రాంబాబు, సల్మాన్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

మద్దిపాడు: ముందు వెళుతున్న ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ఒంగోలుకు చెందిన ఆటో డ్రైవర్‌కు గాయాలైన ఘటన మద్దిపాడు లారీ యూనియన్ ఆఫీసు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. లక్ష్మిశెట్టి శ్రీను (45) తన ఆటోలో మద్దిపాడు వైపు వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో శ్రీనుకు వెన్నెముక వద్ద నొక్కుకు పోవడంతో తీవ్రమైన నొప్పితో విలవిల్లాడాడు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది 108 ద్వారా ఒంగోలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.